అవినీతికి పాల్పడే వారిని దూరంగా ఉంచాలి

- బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- ఖాజాగూడ గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్స్, శిల్పా పార్కులో సమావేశాలు

రాయదుర్గం: అవినీతి కార్యకలాపాలకు పాల్పడే వారిని ప్రజలు దూరంగా పెట్టాలని బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిపై ఆయన పలు ఆరోపణలు చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలోని గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్, శిల్పాపార్కులో ప్రచారం చేశారు. అనంతరం క్లబ్ హౌజ్ లో ఆయన మాట్లాడారు. ఎంపీ రంజిత్‌రెడ్డి గతంలో పౌల్ట్రీకి సంబంధించి పలు అవకతవకలకు పాల్పడ్డారని ధర తక్కువగా ఉండే చిన్న కోడిగుడ్లను అంగన్‌వాడీ కేంద్రాలకు, ప్రభుత్వ స్కూళ్ళకు సరఫరా చేసి డబ్బులు వెనకేసుకున్నారని అన్నారు. అలాగే శేరిలింగంపల్లి ప్రాంతంలో భూకబ్జాకు పాల్పడ్డారని విమర్శించారు. నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్త శుద్ధి ఉన్నవారికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవి కుమార్‌యాదవ్, సీనియర్ నాయకుడు రాధాకృష్ణయాదవ్, పలువురు ఐటీ ఉద్యోగులు, గేటెడ్ కమ్యూనిటీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డికి మద్దతుగా ఆయన సోదరి అనితారెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి మియాపూర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నగేష్, మాణిక్‌రావు, లక్ష్మణ్,సత్యనారాయణ, రాజు, యాదగిరి, శివ,సురేష్ పాల్గొన్నారు.

గోపన్‌పల్లిలో సమావేశం

రాయదుర్గం: శేరిలింగంపల్లిలో బీజేపీ భారీ మెజార్టీ సాధించడం ఖాయమని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గోపన్‌పల్లిలో ఆదివారం సాయంత్రం బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యుడు వసంతకుమార్‌యాదవ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సోదరి శ్రవణ్యరెడ్డితో కలసి ఆయన మాట్లాడారు.

ఎన్టీఆర్‌కాలనీలో ప్రచారం

బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఎన్టీఆర్‌కాలనీ, తాజ్‌నగర్, సోఫాకాలనీలో ప్రచారం చేశారు. కాలనీ సొసైటీ అధ్యక్షుడు విఠల్ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులు ఇంటింటికి వెళ్ళి బీజేపీ కరపత్రాలను అందించి ఓటు వేయాలని కోరారు.



శిల్పాపార్కులో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ గెలుపును అడ్డుకోలేరు



కాంగ్రెస్ పార్టీలో చేరిన భారతీనగర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన వారితో జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ హమీద్‌పటేల్, నాయకులు

- పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ ధీమా

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ పార్టీ గెలుపును ఎవరూ ఆపలేరని ఆ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సిద్ధిఖ్‌నగర్ బస్తీలోని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు బసవరాజు, రాఘవేంద్రకాలనీ సీ బ్లాక్ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో భారీ మెజార్టీ సాధించేలా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు టి కృష్ణ, సాజిద్, పార్టీ కోఆర్డినేటర్ రఘునందన్‌రెడ్డి, జంగంగౌడ్, శేఖర్‌రెడ్డి, మల్లికార్జున్‌యాదవ్, వెంకటేష్‌నాయక్, గిరి, విజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగండ్లలో..

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం భారతీనగర్ డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ భారతీనగర్ డివిజన్ అధ్యక్షులు గిరి, నాయకులు సునీల్, ప్రవీణ్, వెంకటేష్ గౌడ్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

గేటెడ్ కమ్యూనిటీలపై రాజకీయ నేతల నజర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పటాన్‌చెరు, రామచంద్రాపురం, అమీన్‌పూర్ పరిధిలోని గేటెడ్ కమ్యూనిటీలపై రాజకీయ నేతలు దృష్టి పెట్టారు. లోకసభ ఎన్నికల సందర్భంగా కాలనీల ప్రతినిధులతో మాట్లాడి ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కాలనీవాసులు చెప్పే సమస్యలను విని వాటిని పరిష్కరిస్తామంటూ తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. హామీలతో కాలనీలలో పావులు కదుపుతున్నారు. రామచంద్రాపురం, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పరిధిలలో సుమారు 75పైగా గేటెడ్ కమ్యూనిటీ కాలనీలున్నాయి. కాలనీలు అభివృద్ధి చెందినప్పటికీ పలు కాలనీలలో సరైన రోడ్లు లేకపోవడం, డ్రైనేజీ, తాగునీటి సమస్యలున్నాయి. ఈ కాలనీలలో సుమారు 2లక్షల వరకు ఓటర్లు ఉన్నారు. తెలుగురాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఎక్కువగా ఉంటున్నారు. ఈ కమ్యూనిటీ కాలనీలలో ఐటీ ఉద్యోగులు అధిక సంఖ్యలో ఉన్నారు. వివిధ పార్టీల అభ్యర్థులు ఈ ప్రాంతంలో ఓటింగ్ శాతం పెంచడానికి ర్యాలీలు సైతం నిర్వహించారు. గేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు ఎవరికి ఓటు వేస్తారో వేచి చూడాల్సిందే.

సిల్క్ ఎగ్జిబిషన్ ప్రారంభం

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో క్రాఫ్ట్స్ అండ్ వీవర్స్ ఆర్టిసన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిల్క్ అండ్ కాటన్ ఫ్యాబ్ ఆఫ్ ఇండియా–2024 పేరిట ఆదివారం ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను నటి సౌమ్యజాను ప్రారంభించారు. నగర ఫ్యాషన్ ప్రియులను ఈ ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 60 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శన ఈ నెల 14 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

'మ్యూజిక్ థెరపీ'తో ఒత్తిడికి చెక్

శ్రీనగర్‌కాలనీ: మ్యూజిక్ థెరపీలో భాగమైన ది జెంబే సర్కిల్ థెరపీ ద్వారా ఒత్తిడి తగ్గించుకోవచ్చని, మానసిక ప్రశాంతత పొందవచ్చని ది జెంబే సర్కిల్ వ్యవస్థాపకుడు సాయికుమార్ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని హౌస్ ఆఫ్ గార్మెట్‌లో మ్యూజిక్ థెరపీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ జెంబే థెరపీ పశ్చిమ ఆఫ్రికాలోని సంప్రదాయ వాయిద్యాలలో ఒకటని, ఈ మ్యూజిక్‌లో పీహెచ్‌డీ చేశానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, సంగీతంలోని మాధుర్యాన్ని అందిస్తుందని తెలిపారు.

PUBLIC NOTICE

The General Public is here by informed that, My client Sri. M. RAMAKRISHNA S/o Sri M.Kutumba Rao, Aged 66 yrs, Occ: Business, R/o C601, Jayabheri The Summit, Narsing, Beside Jayabheri The Peak, Gachibowli, K.V.Ranga reddy District, Telangana 500 032, intended to purchase the following property from its vendors the details are as follows:

SCHEDULE OF PROPERTY

All that, the Plot No. 7 admeasuring 300 Sq.Yds, Plot No. 8 admeasuring 300 Sq.Yds, Plot No. 9 admeasuring 338.7 Sq.Yds, and Plot No. 10 admeasuring 341 Sq.Yds, totaling 1279.7 Sq.Yds in Sy. Nos. 369, 375, 377 and part of Sy. Nos. 367 and 368, situated at Nallagandla Village, Serilingampally Mandal, and Municipality, Ranga Reddy District, Telangana state and bounded by: **Boundaries for Plot No. 7** North: Plot No. 8, South: Plot No. 6, East: 60' Wide Road, West: Plot No. 22. **Boundaries for Plot No. 8** North: Plot No. 7, South: Plot No. 9, East: 60' Wide Road, West: Plot No. 21. **Boundaries for Plot No. 9** North: Plot No. 8, South: Plot No. 10, East: 60' Wide Road, West: Plot No. 20. **Boundaries for Plot No. 10** North: Plot No. 9, South: 40' wide road, East: Proposed 60' Wide Road, West: Plot No. 19. NOTICE is hereby given to All persons, including any individual, A Hindu undivided family, a company, Banks, Financial Institution(s), Non Banking Financial Institution(s), A Firm, an association of persons or a Body of individuals whether incorporated or not, Lenders and/or Creditors, having any objection, claim, right, Title and/or Interest in respect of above said schedule property, or any part or any portion thereof by way of Sale, Memorandum of Understanding, Exchange, Mortgage, Pledge, Gift, Trust, Inheritance, Succession, Possession, Lease, Tenancy, Maintenance, easement, License, Baquesth, Baquest, Share, Assignment, Decree or order of any court of law, Attachment, Developmental Rights, Right of Way, reservation, Agreement, commitment or otherwise or demand of any nature whatsoever, to inform the same in writing, supported with the documents to the undersigned, within a period of 15 (fifteen) days from the date of this notice, failing which, the Claim or Claims, if any of such person or persons, shall be considered to have been waived and/or abandoned.

Sd/- **YADDANAPUDI SIVA GOPAL,** Advocate
1-8-276/3/1, Plot No. 112, Lalitanagar Ramnagar Gundu, Hyderabad-044,
Cell: 9440070836/7989096782.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

హఫీజ్‌పేట్: ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు శేరిలింగంపల్లి గుల్‌మొహర్ పార్కు నేతాజీనగర్‌లో నివాసముండే గోపాల్, భార్య దేవులపల్లి రమాదేవి (32)కి ఇద్దరు సంతానం. గతంలో రమాదేవి గొంతుకు సర్జరీ చేయించుకుంది. రెండు నెలల నుంచి గొంతు నొప్పి తగ్గకపోగా కడుపు నొప్పి కూడా రావడంతో ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకొంది. రమాదేవి అన్న చాకలి మల్లేష్‌కు సమాచారం అందించగా అతను చందానగర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్, డీఈ దుర్గా ప్రసాద్, ఏఈ సంతోష్ రెడ్డి తదితరులు

ఆలోగా పనులు పూర్తయ్యేనా..?

రానున్నది వానాకాలం సీజన్ ● బాక్స్‌టైప్ డ్రైన్ పూర్తికాకపోతే కష్టమే





లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో వరద నీటి కాలువ

- లింగంపల్లి రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వరద నీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన పనుల మొత్తం విలువ : రూ. 4 కోట్లు
- బాక్స్‌టైప్ కల్వర్టు, బాక్స్‌టైప్ డ్రైన్ నిర్మాణం
- పనులు పూర్తి చేయాలనుకున్నది : 3 నెలల్లో
- బాక్స్‌టైప్ కల్వర్టు పనులు పూర్తి.. బాక్స్‌టైప్ డ్రైన్ పనులు షురూ

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్ టైప్ డ్రైయిన్ పనులు వర్షాకాలం నాటికి పూర్తవుతాయా అనే ప్రశ్న అందరిలోనూ మెదలుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు బ్రిడ్జి వద్ద వరదనీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన దూరం చేయడానికి బాక్స్‌టైప్ కల్వర్టు, డ్రైన్ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, ప్రజాప్రతినిధులు పలు సందర్భాలలో ఈ పనులను పరిశీలించారు. కల్వర్టు పనులు పూర్తి కాగా బాక్స్‌టైప్ డ్రైన్ నిర్మాణ పనులను చేపట్టారు. వచ్చేది వానాకాలం కావడంతో పనులు పూర్తికాకపోతే వరద నీటి సమస్య తప్పదని అంటున్నారు. పనుల్లో వేగం పెంచి వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

పరిశీలించిన జీహెచ్ఎంసీ అధికారులు

బాక్స్‌టైప్ డ్రైన్ పనుల ప్రగతిని శుక్రవారం జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనులలో నాణ్యత పాటించడంతో బాటు త్వరితగతిన పూర్తి చేయాలని కిందిస్థాయి అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని వారు స్పష్టం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

మియాపూర్: డివిజన్ పరిధిలోని ఆర్‌బిఆర్ కాంప్లెక్స్ వద్ద యలమంచి ఉదయ్ కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు.

ప్రత్యేక ప్రార్థనలు



హఫీజ్‌పేట్: మియాపూర్‌లోని కల్వరి టెంపుల్‌లో బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. డాక్టర్ సతీష్‌కుమార్ ప్రార్థనలు చేసి కాసానిని ఆశీర్వదించారు. ప్రజలకు మంచి చేసే వారి పట్ల దేవుడి దీవెనలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాసాని వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను తరిమికొట్టండి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అబద్దాల కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఏఆర్ బృందావన్ కాలనీ, బృందావన్ టీచర్స్ కాలనీలలో ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాణిక్యం, డీసీసీ కార్యదర్శి సామయ్య, నాయకులు ఎట్టయ్య, అతిక్ సాయిలు ముదిరాజ్ మోరే, శ్రీనివాస్, ఆంజనేయులు, రాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ జడ్పీటీసీ జైపాల్‌ను కలిసి మద్దతు కోరుతున్న కాంగ్రెస్ శ్రేణులు



ఆనంద నర్తనం

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం చెన్నైకి చెందిన ప్రముఖ భరతనాట్య గురువు కలైమామణి రోజా కణ్ణన్ శిష్యబృందం కామాక్షి స్వరజతి, శోభిల్లు, సప్తస్వర, ఆనందనర్తన ప్రకాశం, ననుపాలింప, మాయామా ఎందరోమహానుబావులు, మంగళం అంశాలను రోజాకణ్ణన్, అనంతకృష్ణన్, సహన సెల్వగణేశ్, శ్వేత సంకరన్, భువనేశ్వరీ, వైష్ణవి, నివేద హరీష్, రంగనాయకి విజయరాఘవన్ తదితరులు ప్రదర్శించారు. గురువు రోజా కణ్ణన్‌కి కళాకారులు మాధవి గురు సత్కారం చేశారు.

కేటీఆర్ రోడ్‌షోను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే గాంధీ



ఆల్విన్‌కాలనీ: కొండాపూర్ ఆర్‌టీఏ ఆఫీస్ వద్ద సోమవారం సాయంత్రం 5 గంటలకు జరగబోయే బీఆర్‌యస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్డు షోను జయప్రదం చేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. ఆదివారం వివేకానందనగర్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో కార్పొరేటర్‌లు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళదామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మాజీ కౌన్సిలర్ మోహన్‌గౌడ్, రవీందర్ ముదిరాజ్, గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

గోకుల్ ప్లాట్స్‌లో ప్రచారం

హఫీజ్‌పేట్: బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దామంటూ ఎమ్మెల్యే గాంధీ ఆదివారం మాదాపూర్ డివిజన్ పరిధిలో గోకుల్ ప్లాట్స్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటి మెంబర్లు, బస్తీ కమిటి మెంబర్లు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ పార్టీ ముందుంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ, విద్యుత్‌నగర్, పాత ఎంఐజీ, హెచ్ఐజీ కాలనీలను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి విద్యావంతుడైన వెంకట్రామిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి సతీమణి ప్రణీత రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, నగేష్, పరమేష్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగులతో సంగీతారెడ్డి ఆత్మీయ భేటీ



ఐటీ ఉద్యోగులతో మాట్లాడుతున్న కొండా సంగీతా రెడ్డి

గచ్చిబౌలి: పార్లమెంట్ మెంట్ ఎన్నికలలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకుంటామని ఆయన సతీమణి సంగీతా రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కొండాపూర్‌లోని మినర్వా గ్రాండ్‌లో ఐటీ ఉద్యోగులతో ఆత్మీయ భేటీలో ఆమె మాట్లాడారు. దేశాన్ని ఆదర్శంగా నిలుపుతున్న మోదీని మరోసారి ప్రధాని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కృషి చేస్తారని మే 13న జరిగే పోలింగ్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొని కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఆమె కోరారు. ఆమెతో పాటు మహిళా మోర్చా నాయకురాళ్లు పాల్గొన్నారు.

వాకర్స్‌తో ఆత్మీయ సమావేశం



వాకర్స్‌ను కలిసిన జగదీశ్వర్‌గౌడ్

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ కాలనీవాసులు, వాకర్స్‌తో అల్పాహారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న కాలనీ వాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గుల్‌మొహర్‌పార్కు కాలనీలో ఆదివారం ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, స్మిత డెంటల్, జెన్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ ఆనంద్ కుమార్‌లు మాట్లాడుతూ నిత్యం వ్యాయామం, మెడిటేషన్, వాకింగ్ చేయాలని సూచించారు. ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి ,కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం, ప్రతినిధులు ఆనంద్‌కుమార్, మోహన్‌రావు, ప్రతినిధులు జనార్దన్, పాలెం శ్రీను, ధర్మసాగర్, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటి ప్రచారం



పార్టీ కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్‌లో బీజేపీ నాయకులు శనివారం రాత్రి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు నీరటి చంద్రమోహన్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్ళి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకర్, చంద్ర, జంగయ్య, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ శక్తి కేంద్రం ఇన్‌చార్జి వీరూ యాదవ్, బీఎస్‌ల ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ బృందావన్ కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ఓటర్లకు వివరించి ఈ ఎన్నికల్లో కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్



ప్రచారంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: చేవెళ్ల పార్లమెంట్ బీఆర్‌యస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేయాలంటూ హైదర్‌నగర్ డివిజన్ భాగ్యనగర్ కాలనీలో ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో ప్రచారం చేశారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయటం లేదని ఆరోపించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బైకు ఢీకొట్టిన ఘటనలో తీవ్ర గాయాలై వ్యక్తి మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివకుమార్ కథనం ప్రకారం... నారాయణఖేడ్ మండలం, మధువర్ గ్రామానికి చెందిన మల్లేశం(30) బతుకుదెరువు కోసం రామచంద్రపురం మండలం వెలమెల గ్రామంలో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పటాన్‌చెరు వైపు నుండి బైక్ పై వెలమెల వెళ్తుండగా ఘనపూర్ వేములకుంట ఎక్స్ రోడ్డు వద్ద కొల్లూరు వైపు నుండి పటాన్‌చెరు వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును మల్లేశం ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు.సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం ఆర్టీసీ డ్రైవర్ మంగపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో.. స్కూటీని ఢీకొన్న లారీ

పటాన్‌చెరు టౌన్: ఓ లారీ స్కూటీని ఢీ కొన్న ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలై, చికిత్స పొందుతున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ, హనుమాన్ నగర్‌కు చెందిన అభినవ్(21) పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలోని ఓ ఫార్మా కంపెనీలో హెల్పర్‌గా పని చేస్తూ చిట్కుల్‌లోని శ్రీరామ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10 గంటలకు అభినవ్ స్నేహితుడి స్కూటీ తీసుకుని హాస్టల్ నుండి కర్రీ పాయింట్‌కు రావడానికి ఇస్నాపూర్ కు వెళుతుండగా హైదరాబాద్ నుండి సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఇస్నాపూర్ గ్రామ శివారులో గల పృథ్వీ పెట్రోల్ బంక్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న స్కూటీని రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో అభినవ్ రెండు కాళ్లు విరిగిపోయాయి.

సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ముందుగా శ్రీకర ఆసుపత్రి మదీనాగూడకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. అభినవ్ తండ్రి హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.